# అనాఘ్రాత పుష్పం లేక మగబుద్ధి

శేషగిరి యేడాది క్రితం బదిలీఅయి బెజవాడ నుంచి యిక్కడికి వచ్చాడు. ఈ మధ్య అతనికీ నాకూ బాగా పరిచయం కూడా పెరిగింది. అది స్నేహంగా కూడా వృద్ధి అవుతోంది.

ఆ రోజు ఆదివారం -

ఇద్దరం సినిమా హాలు దగ్గర కలిశాం. వాళ్లింటికి చుట్టాలు వచ్చిపడ్డారట. ఆ దాడినుంచి విశ్రాంతి కోసం సినీమాకి వచ్చాడు. నేను నాలుగు నెలల తరువాత ఇన్నాళ్లకు మళ్లీ సినీమాకి వెళ్లాను. ఇద్దరం పక్కపక్కనే కూచున్నాం.

అతను ఆఫీసు పనిమీద ఇటీవల పదిరోజుల పాటు హైదరాబాద్‌లో గడిపి వచ్చాడు. ఆ విశేషాలు ఒకటొకటీ చెప్పుకొస్తున్నాడు. నా మట్టుకునాకు సినీమా కంటె ఆ కబుర్లే నాకెందుకో చాలా బావున్నాయి.

ఇంటర్వెల్ తరువాత సినీమాకథలో ఒక కొత్తమ్మాయి ప్రవేశించింది. అందంగా సన్నంగా, చాలా తాజాగా వుంది. ఆ అమ్మాయిని చూసి, శేషగిరి కొత్త విశేషాలు చెప్పడం మొదలుపెట్టాడు.

"సరిగ్గా యిలాగే వుంటుందా అమ్మాయి కూడాను. వయసు మహావుంటే ఇరవయిరెండు ఇరవయిమూడేళ్ళుంటాయి. టైపిస్టుగా కొత్తగా ఉద్యోగంలో చేరిందట. ఎంత ఫైన్‌గా వుంటుందో చెప్పలేం. సినీమా తారలందరూ ఆ పిల్లముందు బలాదూరే. కంఠం బహు శ్రావ్యంగా వుంటుంది. చాలా చలాకీగా వుంటుంది. గ్రాడ్యుయేట్ కూడాను. మరి ఆమె ఎందుకలా మామూలు టైపిస్టుగా వుండి పోయిందో ! కిలకిలలాడుతూ నవ్విందంటే - ఓహ్ - ప్రాణం గిలగిలలాడిపోవల్సిందే." అంటూ కాసేపు అలా అలా పంచరంగుల మబ్బుల్లోకి వెళిపోయాడు.

ఎవరు ఏ విషయం గురించి మాట్లాడు కోవడం ప్రారంభించినాసరే రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం, సాహిత్యం, సినీమాలు, కళలు .... చాలా త్వరలో ఆడవాళ్ళకబుర్లలోకీ, సెక్స్‌కబుర్లలోకీ దిగిపోతారు. ఈ సంగతి నేను చాలా కాలంనుంచి గమనిస్తున్నాను. ఆఫీసు భోగట్టాలు, ప్రమోషన్లు, బదిలీలు ఇలా మాట్లాడుతూ మాట్లాడుతూ ఆడపిల్లల గురించి నోరూరేలా కబుర్లు చెప్పడం ప్రారంభిస్తారు. ఎక్కువభాగం గాలి ఊహలూ, కల్పితాలూను - శేషగిరి యిందుకు భిన్నంకాదు. ఆఫీసు కబుర్లు ప్రారంభించాడు.

"పాపం పేదపిల్ల. ఒకరోజున నన్ను వాళ్ళయింటికి కూడా తీసుకు వెళ్లింది. ఒక పాతకాలపు డాబాయింటిలో వుంటున్నారు. తండ్రి వెంకట రమణ శాస్త్రి చిన్నతనంలో నవాబు దగ్గర కొలువు చేశాడు. ఆ వుద్యోగం వూడిపోయాక ఏదో ప్రయివేటు కంపెనీలో పనిచేశాడు. ఒకపక్కకూలిపోతున్న పాతకాలపు డాబాయిల్లు తప్ప ఏమీ లేదు. పెన్షన్ లేదు - అతనికి నలుగురు మొగపిల్లలూ, ఇద్దరు ఆడపిల్లలూను. మొగపిల్లలిద్దరు

తండ్రితో తగువు తెచ్చుకుని వేరు కాపురం వెళ్లిపోయారు. ఆడపిల్లల్లో ఈ అమ్మాయి చిన్నది - తండ్రివయసు డెబ్భయి పైనే - నాకు జాలి వేసింది వాళ్ళస్థితి చూసి" - అని ఆగాడు శేషగిరి, కొంచెం ఊపిరి తీసుకుని మళ్ళీ ఉత్సాహంగా ప్రారంభించాడు.

"నాకు పెళ్ళయి వుండకపోతే - సమస్త ప్రపంచాన్నీ ఎదిరించి అయినాసరే, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుని వుందును. నలభై రెండేళ్ళ ఈ వయసులో యవ్వనం క్రమక్రమంగా నిష్క్రమిస్తున్న సమయంలో ఆమెతో నేను పొందిన సౌఖ్యాలు .... నా వల్ల కాదు - నేను వర్ణించలేను - నేను మళ్ళీ టీనేజ్ కుర్రాణ్ణయి పోయానంటే నమ్ము....." తన అనుభవాల్ని ఇంకా బ్లూఫిల్మ్‌లో చూస్తున్నట్టున్నాడు శేషగిరి. .. ఆ విషయం అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. చీకట్లో కూడా ఆ ముఖకవళికలు తళతళలాడి పోతున్నాయి.

"నేను హైదరాబాద్‌లో వుండవలసిన రోజులకంటే ఎక్కువే వుండిపోయాను. ఇంతలో ఆ అమ్మాయికి సహజమైన అడ్డు రానే వచ్చింది - చివరి రోజున సుల్తాన్ బజార్ కు వెళ్ళి రెండు చీరలు కొనిపెట్టి, ఆమె పర్సులో ఐదు వంద నోట్లు కూడా పెట్టాను. నాకు ఫస్ట్‌క్లాసు టి.ఏ. డి.ఏ. వస్తుంది. ఆ డబ్బుల్లోంచి ఐదొందలు ఇచ్చాను. వద్దన్నది. నా బలవంతానే పుచ్చుకున్నది -"

"మళ్ళీ హైదరాబాద్ వెళితే కలవవచ్చునన్న మాట-" అన్నాను చిరునవ్వు నవ్వుతూ, కొంచెం వ్యంగ్యం ధ్వనించేలా.

"ష్యూర్ ష్యూర్-" అంటూ నవ్వేడు. కాని వెంటనే అతని ముఖంలో రంగులు మారి పోయాయి. ఈ సారి అతని కంఠంలో కూడా మార్పు కనిపించింది.

"మరొకర గంటలో గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతావనగా ఆఫీసు ప్యూన్ నాతో ఒక విచిత్రమయిన విషయం చెప్పాడు. ఆ అమ్మాయి మరికొందరితో కూడా లోగడ యిలాగే చేసిందిట. మొదట చాలా అమాయకంగా నటిస్తుందట. తరువాత క్రమంగా కథలోకి దించుతుందట. నాకు ఎంతమాత్రం నమ్మబుద్ధి కాలేదు - ఆమె అనాఘ్రాత పుష్పం అనీ - ఆ సుగంధాన్నీ, మకరందాన్నీ చవిచూచిన మొదటివాడిని నేనేననీ ఎందుకో ఒకమూల నాకు నమ్మకం వుంది. కాని ఆమె ఏ దారుణ దుర్భర ఆర్థిక పరిస్థితుల్లో ఇలా చేస్తుందో ననిపించింది. ఎంతో జాలి కలిగింది. నా జాలి ఆమె సమస్యల్ని పరిష్కరించదు కదా"

సినిమా కళ్ళముందు కదుల్తోందిగానీ - మా యిద్దరి మనసులలోనూ మెదుల్తున్న ఆలోచనలు వేరుగావున్నాయి. -

"నా సూట్‌కేస్‌లో బహుశా ఆ అమ్మాయి ఫోటో మా ఆవిడ చూసి వుండవచ్చు. కొంత గొడవ చేసింది గాని సర్దిచెప్పాను. నమ్మలేదనుకో. నేను వెంటనే గ్రహించి ఆ ఫోటో తీసుకొచ్చి ఆఫీసులో నా బీరువాలో చాలా రహస్యంగా దాచేశాను. రెండు మూడు రోజులు మా ఆవిడ చాలా ముభావంగా వుంది. బాధపడుతోందనీ, పైకి చెప్పలేక పోతోందని అర్థమైంది. ఆపైన నన్ను మాత్రం మాటవరసకైనా అడగలేదు. గత పదహారేళ్ళుగా ఆమెతో కాపురం చేస్తున్నాను. ఏ విషయంలో చూచినా ఆమె వంటి నిజాయితీ గల భార్య వుండబోదు - ఇన్నాళ్ళకు, నేనే ఆమెను మోసం చేశాను - భార్యలలో శీలాన్నీ, నిజాయితీని కోరే

మగవాళ్లు, ఆ సూత్రం తమకు కూడా వర్తిస్తుందనుకోకపోవడం, మగవాడు ఎంతమంది పరాయి ఆడవాళ్లతో కులికినా ఫరవాలేదనుకోవడం ఎంత ఘోరం... ! నేను మా ఆవిడని మోశం చేసానేమోననే భావం నన్ను వెన్నాడుతోంది. నేను చాలా గిల్టీగా ఫీలయ్యాను. మనుషుల్లో ఎన్నెన్ని వైరుధ్యాలు ఎన్నెన్ని అసంగతాలు "

ఉన్నటుంట్టుండి శేషగిరి ఈ విధంగా మాట్లాడటం నాకు అమిత ఆశర్యాన్ని కలిగించింది. ఇప్పుడేకదూ అనాఘ్రాత పుష్పం గురించి మాట్లాడాడు - !

ఇంతలో తెరపై "శుభం" అనే అక్షరాలు కనిపించాయి. సినిమా లోంచిబయటకు వచ్చాం. దారిలో శీలం, పవిత్రత, భార్యాభర్తల్లో ఒకరిపట్ల మరొకరి నిజాయితీ ఇత్యాది అంశాల గురించి మాట్లాడాడు శేషగిరి.

నిన్న - అవును నిన్ననే - సాయంత్రం ఆరుగంటల వేళలో టర్నర్ చౌల్ట్రీ దగ్గర సూపర్ బజార్‌లో శేషగిరీ, అతనిభార్యా షాపింగ్ చేస్తూ కనిపించారు. శేషగిరి భార్యను నేను అదే చూడటం !

ఆమె ఎవరో కాదు - అవును - ఆమె !

ఈ విశాఖపట్నంలోనే సుమారు 17 సంవత్సరాల క్రితం విశాఖపట్నపు బీచ్‌లో ఎంతో అన్యోన్యంగా సాయంత్రాలు గడిపాం ! ఎంత వెన్నెల కరగదీశాం ! పెళ్లి చేసుకుతీరాలని ఎన్ని కలలుగన్నాం ! ఎంత ఆందోళన పడ్డాం ! నాకు వుద్యోగం లేదు - అంటే తల్లిదండ్రుల్ని ఎదిరించి ఇవతలికి రావడానికి తగిన ఆర్థికస్థోమత, సాంఘిక భద్రత లేవు. స్నేహితులు మాయిద్దర్నీ ఎంతకాలం పోషిస్తారు? ఇంతలో ఆమె నెల తప్పడం..... ఆ సమయంలో డాక్టర్‌శేఖర్ మమ్మల్ని కొంతవరకు ఆదుకున్నాడు. త్వరలోనే ఈ గొడవలు బయటికి రాకుండా ఆమెకు పెళ్లి జరిగిపోయింది. ఇవాళ ఆమె శేషగిరి భార్య......

ఈ కథంతా కొద్ది సెకండ్లలో కళ్లల్లో మెదిలింది.

దూరంనుంచి - జనంలోంచి - ఆమె నన్ను చూసింది. చాలా స్పష్టంగా చూసింది. కానీ గుర్తించిన లక్షణాలు ముఖంలో కనపడకుండా చాలా జాగ్రత్తపడింది. ఒకరి కొకరం ఎదురయ్యే పరిస్థితి తెచ్చుకోకుండా - నేను అక్కడే పత్రికల షాపులోకి దూరి అద్దాల్లోంచి వార్ని చూశాను. ఆమెది ఎంత అందమైన తెలివి ! ఆమె ఎర్రని ఎరుపు కాదు. విచిత్రమైన చామనఛాయ కాని కుసుమ ప్రతికదలికలో శిల్పం ఉంది, అందం ఉంది, నవ్వుల్లో సంపెంగ పరిమళం ఉంది, 17 సంవత్సరాల తరవాత చూసినప్పటికీ ఆమెలో దాదాపు మార్పులేదు కాస్త పుష్టిగా ఉంది, చక్కనమ్మ లావెక్కినా అందమేగావును.

పెళ్ళికి ముందే తన భార్య కుసుమకొక ప్రేమకథఉందని శేషగిరికి తెలుసునని విని స్టన్‌అయిపోయాను. కాస్త భయపడ్డానేమో కూడా. కొంపముంచితన భార్య మాజీప్రియుడ్ని నేనేనని కూడా తెలుసునా ? తెలిసి ఏదోకరోజు నాపై కక్షతీర్చుకుందుకు వస్తాడా ? తన భార్య అనాఘ్రాత పుష్పం కాదని తెలిసినా పెళ్లి చేసుకున్నాడా ? ఛ - ఛ - ఏమిటీ నాకీవెధవోచన్లు చాలా దుర్మార్గంగా మగ మృగంలాగా ఆలోచిస్తున్నట్టున్నాను.

మహాకవి కాళిదాసు తన అభిజ్ఞాన శాకుంతలంలో గావును "అనాఘ్రాత పుష్పం" అనే పదం వాడేడట. నిజానిజాలు స్పష్టంగా తెలీదు. సంస్కృత పండితుల్నడగాలి. ఈనాటి నా పరిజ్ఞానం

ప్రకారం ఆ పదం - అసలు - ఆభావం ఎంత స్వార్థపరమైనదో దుర్మార్గమైనదో అర్థం అయ్యేసరికి మొదటిసారిగా నాలోనాకు సిగ్గనిపించింది. హారిబుల్‌గా గిల్టీగా ఫీలయ్యాను. నా - లేక మా మగబుద్ధి ఎంత మృగప్రాయమైనది ! నిక్రుష్టమైనది.

ప్రథమానుభవం - నిజాయితీ - శీలం - యిత్యాదులతో ఆడవాళ్ల చుట్టూ ఈ మగబుద్ధి ఎన్నెన్ని ముళ్ళకంచెలు అర్థం లేని భావాల సాలిగూడ్లు అల్లింది. స్త్రీలో మాత్రమే పవిత్రతను ఆశించే మగబుద్ధి ఎంత స్వార్థపర మైనది ! ఇందుకు నేను కూడా మినహాయింపుకాదు. నా మగబుద్ధితో నా నుంచి నేనే దూరంగా పారిపోవడానికి ప్రయత్నిస్తున్నాను. ఎంత అవకాశవాదిని చాలా గిల్టీగా పీలవుతున్నాను. కాని - స్త్రీలు నిస్సందేహంగా పురుషులకంటే గొప్పవారు. ఎంత గడ్డు వాస్తవాన్నయినా స్వీకరించి జీర్ణించుకొని ముదుకు నడవగల మానసిక స్తోమత కలవారు. కాని నలభై ఏళ్ల మగ దుర్మార్గపు ఆలోచన తరువాత ఈ కొద్దిపాటి జ్ఞానమైనా కలిగింది.....

*రచన : 1 9 8 6 (కథల పోటీలో ప్రచురణకు ఎన్నికైనది)*
*ప్రచురణ : ఆంధ్రజ్యోతి వారపత్రిక 16-1-1987*
*అనేక మార్పులతో ఉదయం 30 జూన్ 1988*